క్లుప్తంగా

ఆలయానికి రూ.75వేలు ఆదాయం

నందిగామరూరల్:మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల వేలం పాట ద్వారా రూ.75,540 ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. గ్రామంలోని అమ్మవారి ఆలయ ఆవరణలో శుక్రవారం రాత్రి చీరల వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలం పాటలో 308 చీరలకుగాను పైఆదాయం వచ్చినట్లు వివరించారు. చందర్లపాడు గ్రూప్ టెంపుల్స్ ఈవో తేజ, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



మక్కపేట(వత్సవాయి): మండలంలోని మక్కపేటలో శ్రీపార్వతీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, గంగమ్మ తల్లి ఆలయాల ప్రతిష్ఠామహోత్సవాలు శనివారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు యలమంచిలి కృష్ణమూర్తి, అర్చకులు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని విగ్రహాలకు పూజలు చేశారు. మొదటిరోజు యాగశాల ప్రవేశం, పూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, యాగశాల బలిహారణ కార్యక్రమాలను పూర్తిచేశారు. ప్రతిష్ఠామహోత్సవాల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు కేవైఎస్ శర్మ, అత్తలూరి యుగంధర్‌శర్మ, సంగయ్య శర్మ, హనుమంతురావుశర్మ, గ్రామ పురోహితులు రాఘవశర్మ, సర్పంచ్ మల్లెల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 25వేల విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నందిగామకు చెందిన మారం భాస్కరరావు దంపతులు రూ. 25,116లను శనివారం విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ పేర్కొన్నారు. దాతలకు స్వామివారి పూజల అనంతరం శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు చీరలు పంపిణీ



గండేపల్లి(కంచికచర్ల): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గండేపల్లి సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ అందజేసిన చీరెలను సర్పంచి బొక్కా రవికుమార్ శనివారం పంపిణీ చేశారు. ఉద్యోగుల సేవలను కొనియాడారు. డిజిటల్ అసిస్టెంట్ నాగరాణి, మహిళా పోలీస్ రాణి, ఏఎన్ఎం శిరీష, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు



కంచికచర్ల: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు బాగుపడతాయని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల శిక్షణ పొందిన 20మంది మహిళలకు శనివారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, పాపట్ల సీత, నన్నపనేని నరసింహారావు, బండారుపల్లి నాగపుష్పలీల, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు కాంస్యం

విజయవాడస్పోర్ట్స్: 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు కాంస్యపతకం సాధించింది. మంగళగిరిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలు శనివారం ముగిశాయి. లీగ్ దశ నుంచి అద్భుతంగా రాణించిన ఎన్టీఆర్ జిల్లా జట్టు శుక్రవారం సెమీస్‌కు చేరింది. మూడో స్థానం కోసం శనివారం జరిగిన పోటీలో 1–0 తేడాతో గుంటూరు జిల్లా జట్టును ఓడించి ట్రోఫీ సాధించింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.జాన్సన్, ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ప్రతినిధులు జి.హర్షవర్ధన్, పి.థామస్, సూర్య ప్రకాష్ చేతుల మీదుగా ఎన్టీఆర్ జిల్లా జట్టు ట్రోఫీ అందుకుంది.

మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామలో వైఎస్సార్ సీపీ ఆఫీసులో కేక్ కట్ చేస్తున్న మహిళానాయకులు



మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో..



సన్మానగ్రహీతలతో పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఎంపీడీఓ శ్రీను, అధికారులు



పేటలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



పేట ఆరోవార్డులో కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హఫీజున్నీసా, కార్మికులు



జగ్గయ్యపేట మండలం ముక్త్యాలలో సన్మానం

నందిగామటౌన్: మహిళ బాగుంటే కుటుంబం, తద్వారా సమాజం బాగుంటాయని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు తొలుత కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు అధిక ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి పాలనలో మహిళలు అభద్రతా భావనకు గురవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజని, మహిళా నాయకులు షేక్ షహనాజ్‌బేగం, శాఖమూరు వెంకటకుమారి, షేక్ ఫాతిమా, విజయమ్మ, కస్తాల పున్నమ్మ, విజయలక్ష్మి, ఐలపోగు రమ, దుర్గ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండల కేంద్రం కంచికచర్లతోపాటు ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ, మహిళలకు వంటింటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. తొలుత మండలంలోని మహిళా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, వేమా రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

అమ్రితసాయి, మిక్ కళాశాలల్లో...

పరిటాల అమ్రితసాయి, కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కాలేజీల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.శశిధర్, డాక్టర్ టి.వంశీకిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వివరించారు. అనంతరం మెప్మా సిబ్బంది, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మునగచర్ల తదితర గ్రామాల్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయంలో ఐసీడీఎస్, వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కొలుసు రమాదేవి, వైస్ ఎంపీపీ కాటేపల్లి రామలక్ష్మి, సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీడీవో ఎన్.రాంబాబు, తహశీల్దార్ కె.ప్రభుకుమార్, వైద్యాధికారిణి హర్షిదాబేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్ పాల్గొన్నారు. అదేవిధంగా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు, రమాదేవి ఆధ్వర్యంలో పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలను ఘనంగా సత్కరించారు. అనుమంచిపల్లిలో సర్పంచి లక్ష్మీత్రివేణి నాయుడు సచివాలయ మహిళా ఉద్యోగులను సత్కరించారు. ముక్త్యాలలో మహిళా ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, అంగనవాడీ, ఆశవర్కర్లు, శానిటేషన్ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అస్మతున్, ఉపసర్పంచి గద్దె శిరీష, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. చిల్లకల్లు మండల పరిషత్, మహిళా సమాఖ్య కార్యాలయాల్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ ఘనంగా సత్కరించారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మంచి సమాజం మహిళలతోనే సాధ్యమని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ గాంధీ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకంగా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, ఎంపీటీసీ సభ్యులు కాకాని స్రవంతి, చాట్ల సుశీల, జంగం వీరమ్మ, గింజుపల్లి విజయలక్ష్మి, సర్పంచులు బి.జ్యోతిబ్రహ్మం, నక్కా కమల, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, అనిగండ్లపాడు గ్రామాధ్యక్షుడు యానాల సురేష్, నాయకులు కాకాని హరి, నక్కా సుధాకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం

జగ్గయ్యపేట అర్బన్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, విమలాభాను పాల్గొన్నారు. అనంతరం సెయింట్ ఆన్స్ అమెరికన్ హాస్పిటల్ వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి నివాళులర్పించారు. సీఎంఏ ఫలితాల్లో ఆలిండియా 12వ ర్యాంకు, సీఏ ఇంటర్‌లో ఆలిండియా 45 వ ర్యాంకు సాధించిన ముక్త్యాల ముళ్లపాడు గ్రామానికి చెందిన కూచి నాగినిని ఘనంగా సత్కరించారు.



జగ్గయ్యపేటలో సన్మానగ్రహీతలతో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: మహిళా సాధికారత కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆపార్టీ పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళా సాధికారత అమలు చేసి చూపించారని గుర్తుచేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలువురు మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కలిపి మొత్తం 40మందిని ఘనంగా సన్మానించారు. లింగగూడెం కవల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పోలంపల్లి రాధమ్మ, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు ధరావత్ శ్యామల, చల్లా సుశీల, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాహోరి బాలమ్మ, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఉక్కు కళావేదికలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, జడ్జి శోభారాణి తదితరులు

ఉక్కుకళావేదికలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఉక్కు కళావేదికలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐపీఎస్ మనీషారెడ్డి, జగ్గయ్యపేట సివిల్‌జడ్జి శోభారాణి, రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ సతీమణి శ్రీవత్సవ మమత, తేజశ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ జయశ్రీ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అవకాశాలను అందిపుచ్చుకుని ఆయారంగాల్లో మరింతగా రాణించాలని పిలుపునిచ్చారు. అతిథులను ఘనంగా సత్కరించారు. మాజీమంత్రి నెట్టెం రఘురాం, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఏసీపీ తిలక్, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు రామలక్ష్మి, మున్సిపల్, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆరోవార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఆధ్వర్యంలో, ఎన్జీవో హోం, వాగ్దేవి మహిళా కళాశాలలో వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులను సన్మానించారు.ఎమ్మెల్యే తాతయ్య, జడ్జి శోభారాణి, ట్రైనీ ఎస్పీ మనీషారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజస్విని, ప్రిన్సిపాల్ బి.సురేష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులతో ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే తాతయ్య, ట్రైనీ ఎస్పీ మనీషారెడ్డి, ఏసీపీ తిలక్, పేట సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా చిల్లకల్లు రోడ్‌లో నుంచి ప్రధానవీధుల్లో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో మానవహారం నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన పలువురు మహిళలను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తహసీల్దార్ మనోహర్, అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, పేట ఎస్ఐలు జి.రాజు, వెంకటేశ్వర్లు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పేటలో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఎన్జీవో సంఘ నేతలు



చెవిటికల్లులో ఆశ కార్యకర్తలను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శి



మహిళలను సత్కరిస్తున్న వత్సవాయి ఆర్యవైశ్య సంఘం నాయకులు



అమ్రితసాయి కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు

వైభవంగా శ్రీరామకోటి మహోత్సవాలు



శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నందిగామరూరల్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామకోటి మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం వేద పండితుల మంత్రోచ్చరణలతో మంగళవాయిద్యాల నడుమ పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో అర్చకుడు సన్నిధానం కిషోర్ శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని వైదిక సంప్రదాయం ప్రకారం వేదోక్తంగా నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక, ధార్మిక, భక్తి కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీతారామనామ సంకీర్తనా సంఘ సభ్యులు, అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజాచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 239 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యలక్ష్మీప్రసన్న

నందిగామటౌన్: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని న్యాయమూర్తులు సత్యలక్ష్మి ప్రసన్న, రియాజ్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ 239 కేసులలో రూ. 1,39,46,876లను పరిహారంగా అందించినట్లు వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సత్వర న్యాయం పొందే వీలుంటుందని తెలిపారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. న్యాయమూర్తి సత్యలక్ష్మి ప్రసన్న, మహిళా న్యాయవాదులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆయా పోటీల విజేతలకు అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, ఏజీపీ అర్జున్, మట్టా ప్రసాద్, న్యాయవాదులు మన్నెం నారాయణరావు, సాంబశివరావు, రమేష్, దాదాహుస్సేన్, అద్దంకి మణిబాబు, హనుమంతరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి : సీపీఎం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోట కల్యాణ్, నాయకులు

నందిగామటౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట కల్యాణ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 17వతేదీ వరకు ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22నుంచి 28వ తేదీ వరకు ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు.

మహిళలకు ఉచిత బస్సు, యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ. 1500 తదితర హామీలను వెంటనే నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వ పాలకులపై ఉందన్నారు. ఆయా పథకాల కోసం ప్రజలు పదినెలలుగా ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు పొంతన లేకుండా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం చుట్టూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రదక్షిణలు చేస్తున్నారు తప్ప ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించడం లేదని మండిపడ్డారు. కేంద్రం నుంచి రావాల్సిన రూ. 20వేల కోట్ల బకాయిలను తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వివరించారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు కటారపు గోపాల్, గోపీ నాయక్, రవిశేఖర్, కరి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, లాజర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఇంద్రకీలాద్రిపై శనివారం పలువురు కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విజయవాడ శ్రీనటరాజ నృత్యాలయం కళాకారులు అమ్మవారికి నృత్య కళార్చన అర్పించారు. రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో 17 మంది కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యం చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రీభరత మాత కోలాట భజన మండలికి చెందిన సభ్యులు కోలాట నృత్య ప్రదర్శన చేశారు.